నమస్తే తెలంగాణ
# నల్లగొండ
I నల్లగొండ, గురువారం 1 మే 2025 NALGONDA



ఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్.వెంకట్రావ్

## యాదగిరిగుట్ట ఆలయ ఈఓగా వెంకట్రావ్

- బాధ్యతలు స్వీకరించిన తొలి ఐఏఎస్ అధికారి

యాదగిరిగుట్ట, ఏప్రిల్30 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కార్యనిర్వహణాధికారిగా ఎస్. వెంకట్రావ్ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం ఆయన ఈఓ కార్యాలయంలో తొలి సంతకం చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్ట ఆలయ ప్రాశస్త్యానికి భంగం వాటిల్లకుండా పని చేస్తానన్నారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా సకల వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. దేవస్థానం డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మ, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహ మూర్తి, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు, ఏఈఓలు గజవెల్లి రమేశ్‌బాబు, రఘు, దూశెట్టి కృష్ణ, పర్యవేక్షకులు రాజన్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. 2015 ఐఏఎస్ క్యాడర్‌కు చెందిన వెంకట్రావ్ తొలిసారిగా ఉమ్మడి నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. అనంతరం 2016లో యాదాద్రి భువనగిరి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా విధులు నిర్వర్తించారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు. ఆ తర్వాత సూర్యాపేట కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ విభాగంలో డైరెక్టర్, జాయింట్ కమిషనర్ బాధ్యతలు కొనసాగిన ఆయన ఇటీవల దేవదాయ, ధర్మదాయ శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం అక్కడి నుంచి బదిలీపై గుట్ట ఆలయ ఈఓగా వచ్చారు.



కోదాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## పది ఫలితాల్లో బాలికల హవా

- సత్తాచాటిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు
- రాష్ట్ర స్థాయిలో యాదాద్రికి 7, నల్లగొండ 11, సూర్యాపేట 14వ స్థానం

రామగిరి/భువనగిరి అర్బన్/సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 30 : పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో సత్తాచాటారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో యాదాద్రి భువనగిరి జిల్లా 7, నల్లగొండ, 11, సూర్యాపేట జిల్లా 14వ స్థానం దక్కించుకున్నాయి. ఉత్తీర్ణతలో బాలికలు హవా చాటారు. యాదాద్రి జిల్లాలో బాలురు 97.53 శాతం, బాలికలు 98.02 శాతం ఉత్తీర్ణత సాధించారు. గతేడాది ఫలితాల్లో జిల్లా 25వ స్థానంలో ఉండగా మెరుపడింది. సూర్యాపేట జిల్లాలో బాలురు 96.18, బాలికలు 97.47 ఉత్తీర్ణత సాధించారు. గతేడాది జిల్లా 6వ స్థానం ఉండగా 14కు పడిపోయింది. నల్లగొండ జిల్లాలో బాలురు 96.40, బాలికలు 97.38 శాతం పాస్ అయ్యారు. గత సంవత్సరం జిల్లా 9వ స్థానంలో ఉండగా రెండు స్థానాలు తగ్గింది. గురుకుల, కస్తూర్బా , మోడల్ స్కూల్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. పుట్ట ప్రసన్న 563 (కేజీబీవీ మాడ్గుపల్లి), జి.వినయ్ వర్షిత 562(కేజీబీవీ తిప్పర్తి) మార్కులు సాధించారు. పరీక్షలో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం జూన్ 3 నుంచి 13 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.




# ఎక్కడి ధాన్యం అక్కడే..

- లారీల కొరతతో తీవ్ర జాప్యం
- మిల్లుల వద్ద నిలిచిపోతున్న లారీలు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- అకాల వర్షాలతో రైతుల బేజారు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న రైతులు

### కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం రాశులు

## ఆగుతూ... సాగుతూ కొనుగోళ్లు

**ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం చెప్తున్న మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన ఉండడం లేదు. ముఖ్యంగా అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లను పెద్దగా పట్టించుకోకపోవడంతో కేంద్రాల్లో సమస్యలు వెంటాడుతున్నాయి. రైతులు ధాన్యం తెచ్చిన కొనుగోళ్లకు కనీసం పది నుంచి 15 రోజులు పడుతున్నది. ఈ క్రమంలో అకాల వర్షాలు రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. నిబంధనల మేరకు తేమ శాతం ఉన్నా కొనుగోళ్లలో జాప్యంతో వర్షాలకు తడిచి కథ మళ్లీ మొదటికి వస్తున్నది. గతంలో మాదిరిగా కాకుండా భూ భారతి వంటి వాటికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోళ్లపై సరైన పర్యవేక్షణ పెట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

– నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ)/నల్లగొండ రూరల్



నల్లగొండ మండలం కొత్తపల్లి ఐకేపీ సెంటర్‌లో పేరుకుపోయిన ధాన్యం రాశులు

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వరి కోతలు ముగింపు దశకు వచ్చినా ఇంకా కొనుగోలు కేంద్రాల్లో లక్షలాది మెట్రిక్ టన్నుల ధాన్యం మూలుగుతున్నది. అధికార యంత్రాంగం పర్యవేక్షణ కొరవడడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క నల్లగొండ జిల్లాలోనే బుధవారం నాటికి ఇంకా సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నది. మొత్తం 337 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 2.99 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు చెప్తుండగా కేంద్రాలకు వచ్చిన ధాన్యం 3.88లక్షల మెట్రిక్ టన్నులు ఉండడం గమనార్హం. ట్యాబ్ ఎంట్రీ, ట్రక్ షీట్ జారీలోనూ జాప్యం జరుగుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇక కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడంలోనే తీవ్ర ఇబ్బందులు ఉన్నాయి. లారీల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. అందుకు ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడమే కారణమనే విమర్శలు ఉన్నాయి. లారీలు మిల్లులకు వెళ్లాక అక్కడ దిగుమతి కాకపోవడంతో లారీ యజమానులు సైతం లారీలను ధాన్యం లోడ్లకు పెట్టేందుకు వెనకంజ వేస్తున్నారు. నల్లగొండలోని బాలాజీ రైస్ మిల్లు వద్దకు లోడ్లతో వెళ్లిన లారీలు నాలుగు రోజులు దిగుమతి కాక ఏకంగా డ్రైవర్లు రాస్తారోకో చేయాల్సి వచ్చింది. ఇలా మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడ్ చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీని వల్ల ఒక్కో కేంద్రంలో మూడు, నాలుగు రోజులకు ఒక లారీ కూడా ధాన్యం తరలింపు జరుగడం లేదు. మిల్లర్లు కూడా తాలు, తేమ పేరుతో మళ్లీ తరుగుకు అంగీకరిస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామంటూ తిరకాసు పెడుతున్న ఆరోపణలున్నాయి. ఇలాంటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాంతో మెజార్టీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం భారీగా పోగుపడి ఉంది. నల్లగొండ జిల్లా కేంద్రం చుట్టుపక్కల కేంద్రాలైన రెడ్డికాలనీ, ఖాజీరామారం, కొత్తపల్లి, జి.చెన్నారంలో ఒక్కో సెంటర్‌లో సమారుగా రెండు నుంచి మూడు లారీలకు సరిపడా ధాన్యం కాంటాలు వేసి సిద్ధంగా ఉంది. కానీ తరలించేందుకు లారీలు లేక నిర్వాహకులు పడిగాపులు పడుతున్నారు.

- ఏఎమ్మార్పీ ఆయకట్టు అధికంగా ఉన్న పీఏపల్లి మండలంలో లారీలు, హమాలీల కొరత తీవ్రంగా ఉంది. మాయిశ్చర్ సరిగ్గా ఉంటున్నా లారీల కొరత, మిల్లు వద్ద సకాలంలో దిగుమతి కాకపోవడంతో జాప్యం జరుగుతున్నది. ఈ మండలంలో లక్షా 40 వేల క్వింటాళ్లు కొనుగొలు చేయాలన్నది లక్ష్యం కాగా, కొనుగొళ్లు ప్రారంభించి 20 రోజులైనా ఇప్పటివరకు 40 వేల క్వింటాళ్లు కూడా కొనుగొలు చేయలేదు.
- కట్టంగూర్ మండలం మునుకుంట్ల ఐకేపీ కేంద్రానికి వచ్చిన ధాన్యం మిల్లుల వద్ద సకాలంలో దిగుమతులు కాకపోవడంతో లారీల కొరత ఏర్పడింది. రెండు రోజులకు ఒక లారీ మాత్రమే వస్తున్నది. ఇక్కడ 6,680 క్వింటాలు కొనుగోలు చేయగా 19 లారీల ధాన్యం మాత్రమే మిల్లులకు తరలించారు. మరో 5వేల క్వింటాళ్ల ధాన్యం కాంటా వేయాల్సి ఉంది.
- శాలిగౌరారం మండలం ఎన్‌జీకొత్తపల్లి ఐకేపీ కేంద్రంలో లారీలు, గోనె సంచుల కొరత తీవ్రంగా ఉంది. ఇప్పటివరకు 6వేల క్వింటాళ్ల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు.
- తిరుమలగిరి(సాగర్) మండలంలోనూ లారీలు, గన్నీబ్యాగుల కొరత ఉంది. దాంతో ధాన్యం ఎగుమతులు ఆగిపోతున్నాయి.

### కేసీఆర్ సార్ ఉన్నప్పడే బాగుండే



వాస్తవానికి నేను కాంగ్రెస్ పార్టీ మనిషిని. కేసీఆర్ గవర్నమెంట్ ఉన్నప్పుడే మంచిగ ఉండే. కాంగ్రెస్ గవర్నమెంట్ వచ్చినంక వేస్ట్. ఇప్పటివరకు రైతుబంధు వెయ్యలే. నాకు రుణమాఫీ కాలే. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి వారం అయ్యింది. మాయిశ్చర్ రాలే అంటుండ్రు. కొనుగొలు చేసిన ధాన్యం సైతం సెంటర్‌లో ఉంటున్నది. బస్తాలకు ఎక్కిన ధాన్యం అకాల వర్షంతో తడిస్తే రైతులదే బాధ్యత అంటున్నరు. లారీలు రాక సెంటర్‌లోనే ధాన్యం బస్తాలు ఉన్నాయి. ఏ అధికారీ ఇటు వచ్చి చూడడం లేదు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులు పట్టించుకోట్లేదు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడే బాగుండే.

**- కొప్పు లక్ష్మారెడ్డి, రైతు, కొత్తపల్లి, నల్లగొండ మండలం**

### లారీల్లేవని కాంటా వేస్తలేరు



మునుకుంట్ల ఐకేపీ కేంద్రంలో నేను వడ్లు పోసి 15 రోజులైంది. లారీల కొరత ఉందని కాంటా వేయడం లేదు. రోజూ ఆరబోసి మళ్లీ కుప్పలు పోస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఇలా లారీల కొరత లేదు. పనులు మానుకొని రాత్రి, పగలు ఇక్కడే ఉంటున్నా. వర్షం వచ్చినప్పుడు పట్టాలు కప్పలేక అవస్థ పడుతున్నాం.

**- ముడుసు రామస్వామి మునుకుంట్ల(కట్టంగూర్ మండలం)**

### రైస్‌మిల్లు దగ్గర ఐదు రోజులు పడిగాపులు



మాది పానగల్. నాకు లారీ ఉంది. నేనే నడుపుతా. ఖాజీరామారం ఐకేపీ కేంద్రం నుంచి ఏప్రిల్ 26న 862 బస్తాల లోడుతో వాళ్లు పంపిన నల్లగొండలోని బాలాజీ రైస్‌మిల్లుకు వచ్చిన. ఇయ్యాల్టికి ఐదు రోజులు అయ్యింది. మిల్లోళ్లు బస్తాలు దించుకోమంటే ఇయ్యాల, రేపు అంటున్నరు. ఈ ఐదు రోజుల్లో నేను పాతిక వేలు నష్టపోయా. ఇలా అయితే ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ఎవరూ లారీలు నడుపరు.

**- సింగం శ్రీశైలం, లారీ యాజమాని, డ్రైవర్ ,పానగల్**

### 4.50లక్షల మెట్రిక్ టన్నులకు

## 70వేల మెట్రిక్ టన్నులే..

- పలుచోట్ల వారమైనా కాంటా కరువు
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన ధాన్యం రాశులు
- హమాలీల కొరత.. ధాన్యం రవాణాలో జాప్యం
- యాదాద్రి భువనగిరి జిల్లాలో రైతుల తీవ్ర అవస్థలు

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగానే నడుస్తున్నాయి. పలు మండలాల్లో వారం రోజులైనా కాంటా వేయడం లేదు. దాంతో ధాన్యం రాశులు కల్లాల్లో నిలిచిపోతున్నాయి. మరోవైపు కొనుగోలు కేంద్రాల్లో రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చినా తేమ, తాలు, నాణ్యత లేమి సాకులు చెబుతూ అరకొరగా కొంటున్నారు. రవాణాలోనూ తీవ్ర జాప్యం నెలకొండంతో రోజుల తరబడే అక్కడే ధాన్యం నిలిచిపోతున్నది. హమాలీల కొరత కూడా ఉంది. అకాల వర్షాల నేపథ్యంలో రైతులే టార్పాలిన్లు తెచ్చుకొని ధాన్యం కాపాడుకుంటున్నారు. జిల్లాలో 327 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించగా, 4.50లక్షల మెట్రిక్ టన్నుల సేకరణను లక్ష్యం నిర్ధేశించుకున్నారు. కానీ.. మంగళవారం సాయంత్రం వరకు 70వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశారు.

- భూదాన్ పోచంపల్లి మండలంలో పది రోజులుగా రైతులు ధాన్యం రాశులుపోసి పడిగాపులు కాస్తున్నారు. రోజుకు ఒకటి రెండు లారీల లోడ్లు మాత్రమే వెళ్తున్నాయి. ధోతిగూడెం, రేగులగూడెంలో హమాలీలు లేకపోవడంతో కాంటా వేయడం లేదు.
- వలిగొండ మండలంలో హమాలీల కొరతతో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయి. సెంటర్లలో టార్పిలిన్లు సరిపడా అందుబాటులో లేకపోవడంతో రైతులే సొంతంగా తెచ్చుకుంటున్నారు.
- చౌటుప్పల్‌లో ధాన్యం కొనుగోలుకు వారానికిపైగా సమయం పడుతున్నది. మండల వ్యాప్తంగా 12 కేంద్రాలు ఉండగా, 20 లారీలు మాత్రమే నడుస్తున్నాయి. మరో 10 లారీలు అవసరమని రైతులు చెబుతున్నారు.
- రాజాపేట మండలంలో ధాన్యం అన్‌లోడింగ్‌కు నాలుగు రోజులు పడుతుండటంతో లారీల కొరత నెలకొంది.
- తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రి, ములకలపల్లి, పెద్దతండా తదితర గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో హమాలీల కొరతతో వారం నుంచి కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఒక్కో కేంద్రంలో ఐదు నుంచి ఆరు లారీల ధాన్యం నిల్వ ఉంది. లారీలు రాకపోవడంతో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. ధాన్యం రాశులపై కప్పేందుకు రైతులే టార్పాలిన్లు తెచ్చుకుంటున్నారు.
- ఆత్మకూరు (ఎం) మండలంలో హమాలీలు, లారీల కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లోడ్‌తో వెళ్లిన లారీలు కూడా మిల్లర్ల వద్ద పడిగాపులు కాస్తున్నాయి.

### హమాలీలు లేక కాంటాలు వేయడం లేదు



రేగులగుంటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి పదిరోజుల క్రితం ధాన్యం తీసుకొచ్చిన. హమాలీల కొరతతో కాంటా వేయడం లేదు. ధాన్యపురాశుల వద్ద రైతులు రాత్రింబవళ్లు నిరీక్షిస్తున్నారు. ఎప్పుడు వర్షం వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. బీహార్ కూలీలు రాకపోవడంతో కొనుగోలు జరుగడం లేదు. వెంటనే లేబర్‌ను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి.

**-కోట రామచంద్రారెడ్డి, రైతు, కనుముకుల, భూదాన్‌పోచంపల్లి మండలం**

## నత్త నడక నయం!

- సూర్యాపేట జిల్లాలో కొనుగోళ్లు వెరీ స్లో
- 3.50 లక్షల మెట్రిక్ టన్నులకు కొన్నది 1.08 లక్షలే..
- రూ.200 కోట్లకు రూ.14 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ

సూర్యాపేట, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల వేగం నత్తలు నయం అన్నట్లు సాగుతున్నది. జిల్లా వ్యాప్తంగా 4,73,739 ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా 12 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గతంతో పోల్చితే అతితక్కువగా కేవలం 3.50 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలని లక్ష్యం పెట్టుకున్నారు. దాదాపు 80శాతం వరి కోతలు పూర్తయిన తరువాత ఒక్కొక్కటిగా 336 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఇప్పటివరకూ దొడ్డు రకం 80 వేల మెట్రిక్ టన్నులు, సన్నాలు 27వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. జాప్యం కారణంగా రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు అయినా మిల్లులకు తెగనమ్ముకుంటున్నారు.

### మంత్రి జిల్లాలోనూ అదే దుస్థితి

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జిల్లా నుంచే ప్రాతినిథ్యం వహిస్తున్నప్పటికీ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు అవస్థలు తప్పడం లేదు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ఏర్పాటుచేయడం, మిల్లులకు టాగింగ్ చేయడంలో ఆలస్యం ఆదిలోనే ఆటంకాలుగా నిలిచాయి. ధాన్యం కొనుగోళ్లు చేయాలని రైతులు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. చాలా మండలాల్లో 20 నుంచి 30 మెట్రిక్ టన్నుల ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. గరిడేపల్లి మండలంలో నాలుగు కొనుగోలు కేంద్రాలు ప్రాంభించగా, పొనుగోడులో ఒక్క గింజ కూడా కొనలేదు. మిగిలిన మూడు కేంద్రాల నుంచి కేవలం 250 క్వింటాళ్లకు మించి కొనుగోలు చేయలేదు. మఠంపల్లి మండలంలో మూడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా రెండు సెంటర్లలో ఒక్క గింజ కూడా కొనలేదు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యంలో 88,506 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులకు తరలించగా, 20వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు కేంద్రాల్లో ఉన్నాయి. 12,921 మంది రైతుల నుంచి దాదాపు రూ.200 కోట్ల ధాన్యం సేకరించిన ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం 381 మంది రైతుల ఖాతాలో రూ.14 కోట్లు మాత్రమే జమ చేసింది.

## నీట్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

- 4న నల్లగొండలోని 7 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

రామగిరి, ఏప్రిల్ 30: నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రన్స్ టెస్ట్(నీట్)–2025 నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 4న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. నీట్ కోసం నల్లగొండ జిల్లా కేంద్రంలో 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 2048 మంది విద్యార్థులు హాజరువుతున్నట్లు పేర్కొన్నారు. ఎంజీయూలో 4, ఎన్జీ కళాశాల, ఉమెన్స్ కళాశాల, కేవీలో ఒక్కొక్కటి చొప్పున పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలపై సందేహాలకు టోల్ ఫ్రీ నంబర్ 18004251442ను సంప్రదించవచ్చని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఇన్‌చార్జి అనదపు కలెక్టర్ రాజ్‌కుమార్, ఏఎస్పీ రమేశ్, డీఎస్పీ శివరామ్‌రెడ్డి, నీట్ నోడల్ అధికారి, కేవీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.










